క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి సఖినేటిపల్లి మండలం మోరి గ్రామానికి చెందిన ఉప్పుగంటి సత్యనారాయణ, నాగమణి దంపతులు గురువారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అప్పనపల్లి సొసైటీ పీఐసీ బాధ్యతల స్వీకరణ

మామిడికుదురు: అప్పనపల్లి సొసైటీ పర్సన్ ఇన్చార్జి కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్‌గా కామిశెట్టి వెంకట్రావు(బాబ్జి), సభ్యులుగా పాటి గోవిందరావు, తులా ఆదినారాయణ చేత సెక్రటరీ గిడుగు శ్రీరాములు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంతు భాస్కరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

మలికిపురం: గ్రామంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణతో అలరించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కోలాటం, ఉట్టికొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. సీహెచ్ హర్ష విజేతగా నిలిచారు. కృష్ణుని వేషధారణలో ఆర్.నెల్సన్ విజేతగా నిలిచారు. రమణ, ఉపాధ్యాయులు ధన లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ

మలికిపురం: విశ్వేశ్వరాయపురం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన పిల్లి గణేశ్వరరావు కుమార్తె దుర్గాభవానీ ఆగర్వాల్(ఎన్నారై, లండన్) బీరువా బహూకరించారు. ప్రధానోపాధ్యాయులు మేడిచర్ల వెంకట రామారావు, ఉపాధ్యాధ్యాయులు రొక్కం శ్రీను, ముత్యాల శ్రీదేవి పాల్గొన్నారు.

ముంపులో పంటలు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షానికి నగరం గ్రామంలోని గుర్రాల చెరువు ప్రాంతంలో వరి పంట ముంపునకు గురైంది. సుమారు 60 ఎకరాల్లో పంట ముంపు బారిన పడిందని స్థానిక రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం నాట్లు వేశామని రెండు రోజుల నుంచి పంట ముంపు నీటిలో ఉందని రైతు తాటికాయల ఉదయభాస్కరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ముంపు నీరు దిగడకపోవడమే ముంపునకు కారణమన్నారు. ముంపు నీరు బయటు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

రావులపాలెం: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్ల పొందేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. 2025 –26 విద్యాసంవత్సరానికి విద్యార్థి ఇంటి నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి అడ్మిషన్ కోసం ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు అర్హులన్నారు. ఏప్రిల్, 2, 2019 నుంచి మార్చి, 31, 2020 మధ్య జన్మించిన విద్యార్థులు ఈ అవకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈనెల 20 తేదీ వరకు సీఎస్‌సీ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన బ్యానర్‌ను ఎంఈఓ విడుదల చేశారు.

ప్రత్యేక ఉపకరణాలకు 98 మంది దరఖాస్తు

రావులపాలెం: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాల కోసం దరఖాస్తు స్వీకరించేందుకు నిర్వహించిన శిబిరానికి 98 మంది హాజరైనట్లు ఎంఈఓ డి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో నిర్వహించిన ఈ శిబిరంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు హాజరయ్యారన్నారు.

సమరయోధుల పోరాటం.. స్ఫూర్తిదాయకం

- స్వాతంత్య్ర చరిత్ర పుటల్లో కొత్తపేటకు ప్రత్యేక స్థానం
- నాటి యోధులను స్మరించుకునే వేళాయె
- జెండా పండగకు సర్వం సిద్ధం


కొత్తపేట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్వాతంత్య్ర సమరయోధుల స్తూపం


రాట్నంపై నూలు వడుకుతున్న దాట్ల పద్మనాభరాజు(ఫైల్)

కొత్తపేట: భారతదేశ స్వాతంత్య్రం కోసం ఎందరో మహానుభావులు గుండె ధైర్యంతో బ్రిటీష్ పాలకులకు ఎదురు నిలిచారు. పోరాటం చేశారు. తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛను అందించారు. వారి త్యాగఫలమే మన సంతోష జీవనానికి కారణం. ఆ నాటి స్వాతంత్య్ర పోరాట చరిత్ర పుటల్లో పూర్వపు కొత్తపేట తాలూకాకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ గడ్డపై పుట్టి పెరిగిన ఎందరో యోధులు స్వాతంత్య్ర సంగ్రామంలో బ్రిటీష్ వారికి ఎదురు నిలిచి పోరాడారు. ఈ పోరాటంలో అనేక మంది ప్రాణాలు విడిచారు. చాలా మంది జైలు జీవితాలు గడిపారు. వారిలో దాట్ల పద్మనాభరాజు ఒకరు. ఆయన మహాత్మా గాంధీతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. ఆయన రాట్నంపై వడికిన నూలుతో నేసిన దుస్తులనే ధరించేవారు. ఆయనకు రాట్నంపై మక్కువ చూసి గాంధీ స్వయంగా పద్మనాభరాజుకు ఒక రాట్నాన్ని బహూకరించారు. ఇప్పటికీ ఆ రాట్నం కొత్తపేటలో ఆయన కుమారుడు సూర్యనారాయణరాజు వద్ద ఉంది. స్వాతంత్య్రానంతరం భారత ప్రభుత్వం స్వాతంత్య్ర సమరయోధులకు ఇచ్చే గౌరవ పురస్కారాలను తిరస్కరించారు. స్వాతంత్య్రానంతరం రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి సుమారు 20 సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేశారు. తరువాత కొత్తపేట మండలం ఖండ్రిగలో స్థిరపడ్డారు. 93వ ఏట 1998 నవంబర్ 11న మరణించారు.

సమరయోధుల స్మారక స్తూపం

1947 ఆగస్టు 15న తొలిసారిగా భారత స్వాతంత్య్ర సంబరాలు జరుపుకున్న భారతావని 1972లో 25వ స్వాతంత్య్ర దినోత్సవం (స్వాతంత్య్ర రజతోత్సవాలు) ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అప్పటి తాలూకా కేంద్రాల్లోని పంచాయతీ సమితి కార్యాలయాల వద్ద స్వాతంత్య్ర సమరయోధుల పేరిట శిలా స్తూపాలను నెలకొల్పారు. దానిలో భాగంగా తాలూకా కేంద్రం కొత్తపేటలో పంచాయతీ సమితి కార్యాలయం ప్రాంగణంలో సమరయోధులు వాత్సవాయి ఆంజనేయవర్మ, పోడూరి వెంకటరత్నం, తురగ పురుషోత్తం, బండారు వెంకటరాజు, దేవులపల్లి సూర్యనారాయణమూర్తి, కళా వెంకట్రావు పేర్లతో స్తూపాన్ని ఆవిష్కరించారు. రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆ సమితి భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంగణంలోనే మండల పరిషత్ కార్యాలయ భవనం నిర్మించగా దాని ముందుకు మార్చి ప్రత్యేక వేదికను నిర్మించారు. 2018 జనవరి 26న ఎంపీపీ రెడ్డి అనంత కుమారి ఆధ్వర్యంలో అప్పటి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అలాగే అదే మండల పరిషత్ కార్యాలయ భవన సముదాయంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని 2015 అక్టోబర్ 15న ఆవిష్కరించారు.

జాతీయ జెండా పండుగకు సర్వం సిద్ధం

భారత స్వాతంత్య్ర దినోత్సవానికి కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, కార్మిక సంఘాల కార్యాలయాలు వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా సంస్థల వద్ద చట్ట సభల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మువ్వన్నెల జెండా ఎదురవేయనున్నారు.

ఉద్యమాల పురిటిగడ్డ నాగుల్లంక

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామం ఉద్యమాల పురిటి గడ్డగా పేరొందింది. స్వాతంత్య్ర సంగ్రామంలో ఈ గ్రామం ప్రముఖ పాత్ర పోషించింది. నాగుల్లంక నుంచి 22 మంది పోరాట యోధులు స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొన్నారు. వీరిలో ఐదురుగు తామ్రపత్ర అవార్డు గ్రహీతలు ఉన్నారు. ఆరుమిల్లి వెంకటరత్నం, ఆరుమిల్లి విశ్వేశ్వరరావు, ఆరుమిల్లి సుబ్బారావు, అడబాల నర్సింహమూర్తి, గ్రంధి సూరన్న, ఆరుమిల్లి చౌదరి, ఆరుమిల్లి తాతయ్య, బద్దే ప్రకాశరావు, గ్రంధి రామమూర్తి, గ్రంధి మూలాస్వామి, గ్రంధి సత్యం, కడలి పద్దయ్య, శ్రీఘాకోళపు వీరరాఘవులు, వలవల వీరన్న, ముద్దా పెరుమాళ్ల స్వామి, చిట్టినీటి మంగయ్యనా యుడు, ఆరుమిల్లి వెంకన్న, మీనవల్లి వెంకటరత్నం, చెన్ను ముత్యం, ఆకుల రఘుపతి, అద్దేపల్లి నర్సింహమూర్తి, గద్దే లచ్చన్నలు ఉద్యమంలో పాల్గొన్నారు. వీరి సేవలకు గుర్తింపుగా 2002లో అప్పటి ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా నాగుల్లంక సెంటర్లో స్వాతంత్య్ర సమర యోధుల స్మారక స్తూపాన్ని నిర్మించి, ఆవిష్కరించారు. పోరాట యోధుల పేర్లను దానిపై చెక్కించారు. అలాగే ప్రధాన పంట కాలువపై వంతెనను నిర్మించి దానికి స్వాంతంత్య్ర సమరయోధుల వంతెనగా అయ్యాజీ వేమా నామకరణం చేశారు. అప్పటి నుంచి ఏటా ఆగస్టు 15న ఈ స్తూపం వద్ద గ్రామస్తులు స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా జరుపుకొంటున్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమర యోధుల వారసులకు అయ్యాజీ వేమా గురువారం సత్కరించారు. స్వాతంత్య్ర సమర యోధుల స్తూపానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, నాయకులు ఆరుమిల్లి వీరభద్రరావు, ఎ.రాంబాబు, చిట్టినీడి రంగసాయి, చీకరమెల్లి శ్రీనివాసరావు, పాలూరి ఫణి, మేడిది సత్యనారాయణ, పసుపులేటి వెంకటేశ్వరరావు, కోటే శివాజీ తదితరులు పాల్గొన్నారు.


నాగుల్లంకలో స్వాతంత్య్ర సమర యోధుల వారసులను సత్కరిస్తున్న అయ్యాజీ వేమా


నాగుల్లంకలో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమరయోధుల స్మారక స్తూపం

రాష్ట్రంలో ప్రజాస్వామ్యమా? రాచరికమా?

కొత్తపేట: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేక రాచరిక వ్యవస్థ నడుస్తోందా అనే సందేహాలు ప్రజలకు సైతం కలుగుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు విమర్శించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని పలివెలలో ఎంపీపీ మార్గన గంగాధరరావు స్వగృహం వద్ద, గంటిలో సర్పంచ్ సాగి బంగార్రాజు స్వగృహం వద్ద కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ముత్యా వీరభద్రరావు పర్యవేక్షణలో ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు తులా సూర్యనారాయణ, భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో డేవిడ్‌రాజు, గంగాధరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వారి సెల్‌తో క్యూర్ క్యూర్ కోడ్ ద్వారా సీఎం చంద్రబాబు మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మునునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సాగి బంగార్రాజు, పార్టీ పరిశీలకులు ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, మాగాపు చక్రవర్తి, ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు, మాజీ సభ్యురాలు పోలిమాటి అంజనీకుమారి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మట్టపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


పలివెలలో క్యూ ఆర్ కోడ్‌లను ప్రదర్శిస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

జగన్‌కు భయపడే పథకాలు ఇస్తున్నారు

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం

మలికిపురం: సూపర్ సిక్స్ అంటూ ఊదర కొట్టి గెలిచాక ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భయపడి అరకొర పథకాలు ఇస్తున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావు పాల్గొని బాబు చేసిన మోసం గురించి ప్రజలకు వివరించారు. జగన్ పోరాటం చేస్తున్నారు కాబట్టే అమ్మకు వందనం అరకొర నిధులు పంచారు అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మట్టపర్తి నాగేంద్ర, మలికిపురం మండలం జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, గ్రామశాఖ అధ్యక్షుడు గుబ్బల రమేష్, సీనియర్ నాయకులు గుబ్బల మనోహర్, పాటి శివకుమార్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుబ్బల సత్యనారాయణ, మలికిపురం సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పిశెట్టి సీతామహలక్ష్మి, ప్రసాద్, బావి, రత్నరాజు, బుచ్చియ్య పాల్గొన్నారు. లక్కవరం, కత్తిమండ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వంచన కార్యక్రమాలు జరిగాయి.


విశ్వేశ్వరాయపురం సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

కూటమి హయాంలో ప్రజా స్వామ్యం అపహాస్యం

కూటమి ప్రభుత్వం హయాంలో ప్రజా స్వామ్యం అపహాస్యం అవుతుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మట్టపర్రు గ్రామంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు విప్పర్తి విజయ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన 'బాబు షూరిటీ మోసం గ్యారెంట్టీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వంచన ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు చేసిన మోసాలను. మండల అధ్యక్షులు బ్రహ్మాజీ, మండపేట నియోజకవర్గం పరిశీలకులు ఆదిత్య కటకంశెట్టి రాష్ట్ర, జిల్లా వివిధ విభాగాల ప్రతినిధులు సహదేవ్ తాడి, చింత వరప్రసాద్, ఉచ్చుల దాసు, జానకిరామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకంటక పాలనపై పోరాటం చేద్దాం

ఆలమూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాకంటక పాలనపై సమరశంఖం పూరిద్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. మండలంలోని నవాబుపేట, కలవచర్ల గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తేడాను అడిగి తెలుసుకున్నారు. కలవచర్ల వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుడుపూడి లోవ సత్యనారాయణతో పాటు పది మందితో కూడిన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నేతలు యనమదల నాగేశ్వరరావు, శ్రీనివాసు, రాంబాబు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, చింతపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నవాబుపేటలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

అయినవిల్లి: ఇటీవల చింతనలంక గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి సర్వ కోల్పోయిన బాధితులకు పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు చేయూతనందించారు. గురువారం సాయాన్ని అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులు మల్లాడి సత్తెమ్మ, మల్లాడి శ్రీహరి కుటుంబాలకు అందించారు. బాధిత కుటుంబాలకు రూ.12,500 నగదు, 50 కేజీలు, నిత్యావసర వస్తువులు, కూరగాయలు గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. బాధితులను ప్రభుత్వ పరంగా బాధితులకు ఆదుకోవాలని గన్నవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతలపూడి వెంకటరత్నం, ఉప సర్పంచ్ కర్రి సుబ్బలక్ష్మి, అయినవిల్లి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీను, అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ గుత్తుల నాగబాబు,, తరేట్ల నాగరాజు, చింతనలంక గ్రామ పార్టీ అధ్యక్షులు విళ్ళ శ్రీను, మాజీ ఎంపీటీసీ సభ్యుడు , కర్రి బాలసుబ్రమణ్యం గారు, సోషల్ మీడియా తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ముంపులో వరి చేలు

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరిచేలు మునిగాయి. నాట్లు వేసి నేల రోజు కాకుండా తమ వరిచేలు మునగడంతో వరి మొక్కలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కుమ్మరి కాలువ డ్రెయిన్ ముంపునీటితో నిండిపోవడంతో ఈ డ్రెయిన్ ద్వారా ముంపునీరు తమ చేలకు చేరిందని రైతులు చెబుతున్నారు. సుమారుగా 100 ఎకరాల్లో వరిచేలు ముంపునకుగురైనట్లు రైతులు చెబుతున్నారు. ముంపునీటిని మళ్లించి తమ చేలను రక్షించాలని వారు అధికారులను కోరుతున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పల్లపుప్రాంతాల్లో వరిచేలు ముంపునకు గురయ్యాయి.


నల్లచెరువు గ్రామంలో ముంపునీటిలో ఉన్న వరి చేలు

విద్యార్థి దేశభక్తి

మలికిపురం: లక్కవరం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలుడు బి.స్టాలిన్ అనే విద్యార్థి బొట్టుబిళ్లలతో గాంధీ చిత్రాన్ని చిత్రికరించారు. ముందుగా ఒక పేపర్‌పై గాంధీజీ స్కెచ్ వేసి దానిపై స్త్రీలు నుదుటిపై ధరించే బొట్టు బిళ్లలను వరుస క్రమంలో అతికిస్తూ బాపు చిత్రాన్ని చిత్రించాడు. ఈ చిత్రం అందరినీ ఆకర్షిస్తుంది. దీంతో స్టాలిన్‌ను అభినందించారు. గతంలో అనేకసార్లు ఇలాగే బొట్టు బిళ్లలతో జాతీయ నాయకులను చిత్రించి అందరి మన్ననలు అందుకున్న ఈ చిన్నారి నాలుగో సంవత్సరంలో గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్, ఐదో సంవత్సరంలో గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ బ్రాంచి మెడల్, ఆరో సంవత్సరంలో అనేక అవార్డులు, ఏడో సంవత్సరంలో గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ మెమెంటోలు అందుకున్నారని ఆయన వివరించారు. పాఠశాల టీచర్స్ ప్రియ జ్యోతి, జ్యోతి, మాధురి, లలిత, స్టాలిన్‌ను అభినందించారు.


స్టాలిన్ వేసిన బొట్టు బిళ్లల గాంధీ

ఇంటిపై జెండా ఎగురవేద్దాం.. జాతీయతను చాటుదాం


మూడు రంగుల బెలూన్స్‌తో తయారు చేసిన ఇండియా చిత్రపటం

కొత్తపేట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయతను చాటుదాం.. అని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం పిలుపునిచ్చారు. కొత్తపేటలో మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్వాతంత్య్ర సమరయోధులు, సంఘ సంస్కర్తల ఫోటోలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర బీజేపీ యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ, జిల్లా, మండల పార్టీ ప్రతినిధులు మద్దింశెట్టి శ్రీనివాసరావు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, వలపశెట్టి కిరణ్, అన్యం సత్యనారాయణ, పెన్నాడ నారాయణరావు, ఉద్దరాజు ప్రసాద్ రాజు, బొర్రా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మలికిపురంలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు


600 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజోలు: జాతీయ జెండాను గౌరవిస్తూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక కళాశాల నుంచి కాటన్ పార్క్ వరకు విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. జాతీయ పతాక రూపకల్పన, విశిష్టత తదితర అంశాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అవగాహన కల్పించారు.


పాశర్లపూడిలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న బీజేపీ నేతలు


కొత్తపేటలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న రాష్ట్ర బీజేపీ నేత పాలూరి తదితరులు

600 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

పి.గన్నవరం: విద్యార్థులు 600 అడుగుల జాతీయ జెండాతో గురువారం పి.గన్నవరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సాయితేజ విద్యా సంస్థల డైరెక్టర్ అన్నాబత్తుల అనుబాబు ఆధ్వర్యంలో స్కూలు నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకూ, అక్కడి నుంచి పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. సర్పంచ్ బి.నాగమణి పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ప్రదర్శన

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులు, అధ్యాపకులు వృత్తాకారంలో నిలబడి స్వాతంత్య్ర నినాదాలతో దేశభక్తిని చాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ అరుణ్ కుమార్, అధ్యాపకులు రమేష్ బాబు, సుభాషిని, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: బీజేపీ మండల అధ్యక్షుడు మేడిచర్ల చాణక్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం నిర్వహించారు. జాతీయ జెండాలతో గాంధీ బొమ్మల కూడలి నుంచి పద్మజా థియేటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్, నాయకులు అడబాల రాంబాబు, చంపాటి శివరామకృష్ణంరాజు, కాపిశెట్టి కనకేశ్వరరావు, కట్ట వాసు, సుంకర రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని బీజేపీ నేత కటికిరెడ్డి గంగాధర్ సూచించారు. పాశర్లపూడిలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ వైనతేయ గోదావరి నదీతీరంతో పాటు గ్రామంలో పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బొక్కా రామకృష్ణ, తుమ్మా పద్మాజీ తదితరులు పాల్గొన్నారు.